# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ

సంపుటి 39 సంచిక 10
పేజీలు 44
జూన్ 2020

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O , బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD

ఈ సంచికలో ............................ ....... పేజీ

శ్రీకృష్ణ కర్ణామృతము ....................................4
శ్రీబాబూజీ ఉవాచ.......................................... 5
అమ్మమాట.................................................. 7
స్వయంప్రభ .................. ...............................10
దేవుడు - దర్జీ ................. ............................12
అడిభర్త ............... ................... ..........................14
మాణిక్య వాచకర్ ............ ............................16
శ్రీ సద్గురు వాణి ........................... ...................18
ఎవరు గొప్ప? ..................................... ..................19
జల్లెడ ............... ............... ....................... .................21
శార్వరి ................ ...................................... .................25
చెప్పాలని ఉంది ..................................................28
గుర్వష్టకమ్ ..........................................................29
జీర్ణ వస్త్రం ................. ......................................31
కైవల్యోపనిషత్ ... ....................................................33
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు..................................34
అగస్త్యుడు ................ ...................... ......................35
సింగరి దాసు .................. ........................................37
సమర్థ సద్గురునాథుని దివ్యచరిత్ర.....39
విష్ణు కథలు ....... ......................... ......................41

# శ్రీ కృష్ణ కర్ణామృతము

కీ.శే - సుశీలా ప్రసాద

**తృతీయాశ్వాసము - 41వ శ్లో॥**

**అనుచుమ్బుతా మవిచలేన చేతసా**
**మనుజాకృతేర్మధురిమిశ్రియం విభో**
**అయిదేవ కృష్ణదయితేతి జల్పతా**
**మపి నో భవేయురపి నామతాదృశాః ॥**



తాత్పర్యము - అంతగా చలింపకుండెడు మనస్సు చేత మనుష్య రూపము దాల్చిన స్వామి యొక్క సౌందర్య సంపదను ఆస్వాదించువారును ఓ దేవ కృష్ణ ! అని చెప్పుచున్నవారును అగు మాకును గూడ మేము కూడా మనస్సులో దలిచినట్టివి అగునేమో!

చలింపని మనస్సుచేత శ్రీకృష్ణుని దివ్య సౌందర్యమును తలంచుచు 'ఓ కృష్ణా!, ఓ దేవ ఓ దేవ!' అని పలుకుచున్న నావంటి వారికి కూడా పూర్వము ప్రత్యక్షముగా అనుభవించిన మహాత్ములకు కలిగిన భాగ్యములు కలుగునో యేమో కదా! కలుగును కదా!

*విశ్వేశ్వర దర్శనానికి అడ్డువచ్చేవి ఏవి?
*కాకి ఎందుకు నీరు త్రాగలేదు?
*సాధన ఫలించింది అనడానికి గుర్తు ఏమిటి?
*పార్వతీ పరమేశ్వరులను వలలో బంధించిన భక్తుడెవరు?
*గుంటనక్కలు గుఱ్ఱాలుగా ఎందుకు మారాయి?
*కలకాలం నిలిచే కలిమి ఏది?
*వికారం అంటే ఏమిటి?
*యుక్తవయస్సులో భోగాలు వదలి జ్ఞాని అయింది ఎవరు?
*ఎటువంటి శిష్యుని మనస్సు నిర్మలం అవుతుంది?

*సమాధానాలు లోపలి పేజీలలో.........................*

# శ్రీబాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

12-4-1980

శ్రీ బాబూజీ ఈరోజు ఉదయం వాకింగ్‌లో “సగుణారాధన అంటే ఏమిటి?” అని ప్రశ్నించారు.

“పూజ, నైవేద్యం, హారతి, మొదలైన క్రియలన్నీ సగుణోపాసనగా పరిగణించబడుతుంది” అని చెప్పారు రత్నంగారు.



“నిర్గుణోపాసన అంటే ఏమిటి?” అని ప్రశ్నించారు శ్రీ బాబు. దాని సమాధానం కోసం వేచియుండక ఆయనే బోధ ప్రారంభించారు.

“నిర్గుణోపాసన అంటే నిశ్చలమైన మనస్సుతో స్వామిని ఆరాధించటం, వికలమైన మనస్సుతో ఎన్ని పూజలు చేసినా, ఎంత ఆరాధించినా, ఎన్ని నైవేద్యాలు పెట్టినా, గురుదేవులకు ప్రీతి కల్గిస్తుందా? గురుదేవులకు ప్రీతి కల్గించేది నిర్గుణోపాసన. ఒక మనోపుష్పాన్ని ఆయనకు సమర్పిస్తే చాలు.

గురుదేవుల కృప పొందాలంటే వారిచ్చిన లక్ష్యార్థమును అచంచల భక్తి విశ్వాసములతో సాధన చేయాలి. అలా చేస్తేనే వారి ఆజ్ఞ శిరసా వహించినట్లవుతుంది. గురువాజ్ఞ శిరసావహించటం అంటే ఆయన చెప్పినది ఆచరించటం అన్నమాట. గురుకటాక్షం పొందగలిగి నపుడే ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది. గురుదేవులు శిష్యులను బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల నుండి రక్షించగలుగుతారు. కాని గురువాజ్ఞ వుల్లంఘిస్తే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు కూడ రక్షించలేరు. అట్టివారు తిరిగి గురుకటాక్షం పొందితేనే ముక్తిని పొందగలుగుతారు.

సగుణోపాసనకన్న నిర్గుణోపాసన గొప్పది. అంతకన్న గురువాజ్ఞా పాలన ఇంకా విశిష్టమైనది. శిష్యుడు ఎంతటి పండితుడైనా,

చక్రవర్తియైనాసరే, గురుదేవునియందు అచంచలమైన భక్తి, విశ్వాసం కలిగిఉండాలి. అటువంటి శిష్యుని మనస్సు నిర్మలమవుతుంది. అంతఃకరణశుద్ధి చెందుతుంది. విశ్వాసం లోపించిన శిష్యుడు అహంకారమనే ముసుగుచేత కప్పబడి ఆత్మ సాక్షాత్కారమును పొందలేడు" అన్నారు శ్రీ బాబు.

శ్రీ బాబూజీ భృగుమహర్షి ఉదంతాన్ని చెప్పారు. "భృగుమహర్షి చాలా గొప్పవాడు. ఆయన పాదమునందు ఒక నేత్రం ఉంది. అది అహంకారమనే నేత్రం. భృగుమహర్షికి ఒకసారి అహంకారం ఆవహించి, మనస్సునందు సదా నిలుపుకోవలసిన శ్రీమన్నారాయణుని కాలితో తంతాడు.

అంతట శ్రీమన్నారాయణమూర్తి భృగుమహర్షిని, "స్వామీ! మీరు నన్ను తన్నినందువలన మీకాలు నొప్పిచేసి ఉంటుంది" అని ఆయన పాదమును పట్టుకొని సేవ చేస్తున్న నెపంతో ఆయన పాదములో ఉన్న అహంకారమనే కంటిని చిదిపివేస్తాడు.

శ్రీలక్ష్మీదేవి శ్రీమన్నారాయణునితో 'స్వామీ! మీరు భక్త రక్షకులు కదా! భృగుమహర్షి యొక్క కంటిని అలా నలిపి వేశారేమిటి?' అని ప్రశ్నిస్తుంది.

శ్రీమన్నారాయణమూర్తి శ్రీలక్ష్మీదేవితో "భృగుమహర్షి మనస్సు వికలమై, అహంకారమనే పొరతో కప్పబడి ఉంది. పాదములో ఉన్న కన్ను పోవటం వలన అతని మనసు నామీదకు మళ్ళుతుంది. కాబట్టి అతనికి మేలే జరుగుతుంది" అంటాడు.

కాబట్టి నిర్మలమైన మనస్సుతో గురుదేవులిచ్చిన లక్ష్యార్థమును శిరసావహించిన వారు గురు కటాక్షమును పొంది, ఆత్మ సాక్షాత్కారము పొందగలరు" అన్నారు శ్రీ బాబు.

# అమ్మమాట

# కీర్తనమ్

- రమణ ప్రసాద్

భగవంతుడిని దర్శించటానికి అడ్డు వచ్చేవి మూడు. అవి- దేహ వాసన. శాస్త్ర వాసన, లోక వాసన. మనం దేవాలయానికి వెళ్తాం. కాని సాష్టాంగ నమస్కారం చేయాలంటే దేహాభిమానం అడ్డు వస్తుంది. ఇంకా మనకి అడ్డు వచ్చేవి - స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు; ధనేషణ, దారేషణ, పుత్రేషణ అనబడే ఈషణ త్రయాలు మొదలైన త్రిపుటులు విశ్వేశ్వర దర్శనానికి అడ్డుగా ఉన్నాయి. అహంకార మమకారాల ప్రభావం చేత మానవుడు అజ్ఞానమనే చీకటిలో పడి కొట్టు మిట్లాడుతున్నాడు. సూర్య కిరణానికి ముందు మూడు కోణాల పట్టకం పెడితే సప్త వర్ణాలు కనిపిస్తాయి. వాస్తవానికి సూర్య కిరణం తెల్లగా స్వచ్ఛంగా ఉంటుంది. అలాగే అహంకారం చేత, త్రిగుణాల చేత ఆత్మ తేజస్సు కప్పబడి ఉండటం చేత ప్రపంచంలోని ఆకర్షణలకు లోనవుతున్నాం. అందువలన మన ఇంటికి మనం చేరలేక పోతున్నాం. మన ఇల్లు ఏది? మన లోపల ప్రకాశించే "సదాశివత్వం". జనన మరణ వలయాన్ని దాటాలంటే ధర్మ పరమైన మార్గంలో నడుచుకోవాలి. సంస్కారం వాసనలతో వస్తోంది. సాంప్రదాయం మన ఆచార వ్యవహారాలతో వస్తోంది. శ్రీ సద్గురు దేవుల అనుగ్రహం వల్లనే మనం ఈ అవరోధాలన్నిటినీ దాటి సదాశివత్వాన్ని పొందగలుగుతాం.



మనం నవ విధ భక్తుల గురించి చర్చించుకుంటున్నాం. అందులో రెండవది - 'కీర్తనమ్'. భావ భరితమైన కీర్తనను వింటే పాడేవారు, వినేవారు ఆనందాన్ని పొందుతారు. కీర్తించెద దేవా - అనే కీర్తనలో చివరిగా - 'పాదాలకొరిగి, అనుభవ వాక్యాల నడచి' అని వస్తుంది. సమర్పణ భావంతో, కీర్తనను శ్రవణం చేయటం ద్వారా అట్టి అనుభూతి కలుగుతుంది. త్యాగయ్య, కబీరు, తుకారాం మొదలైన మహాత్ములు భగవదనుభూతిని పొందుతూ కీర్తనలు పాడారు. అటువంటి

భక్తులు తారస పడితే, 'ఈయన గొప్ప భక్తుడండీ!' అంటాం. ; 'ఈమె నిరంతరం భగవత్సేవలో నిమగ్నమై ఉంటుందండీ!' అంటాం. అట్టి అనుభూతిని మనం కూడా పొందగలగాలి. ఒక్కసారి మనసారా భగవంతుడిని స్మరిస్తే మనస్సు ఆనందభరితమై పోవాలి. "ఎవరి మనస్సు భగవన్నామం చెవికి సోకగానే కన్నుల నుండి అశ్రుధారలు స్రవిస్తాయో, అతని సాధన ఫలించినట్లే " అనేవారు శ్రీగురుదేవులు.

స్మరణ ఉన్నచోట మరణం లేదు. ఈ కలికాలంలో సులభంగా తరించే మార్గం నామ స్మరణమే. '**నామస్మరణాఽదన్యోపాయం నహిపశ్యామో భవతరణే**' మీకు ఇష్టమైన ఏ నామమైనా చేయండి. ఆ దేవుని దివ్య చరణాలపైన మీ మనస్సు నిలబడాలి.

**యత్ఫలం నాస్తి తపసా న యోగేన సమాధినా ।**

**తస్మాద్యత్నేన జప్తవ్యం హరేర్నామైవ కేవలమ్ ॥** అని కలిసంతరణోపనిషత్తు చెబుతోంది. తపస్సు, యోగము, సమాధి వంటి సాధనల వలన సాధ్యంకానిది, కేవలము హరినామ స్మరణ వలన కలుగుతుంది. నామ స్మరణ ఎప్పుడైనా చేయవచ్చు. దానికి మడి లేదు.

నీలో చిత్త వృత్తులను నిరోధించటం నువ్వు చేయలేవు. దానికి గురుదృష్టి కావాలి. గురు దృష్టి నీ మీదపడి నీ అంతఃకరణ పవిత్రమైతే, అందులో భగవన్నామం నిలిచి పోతుంది. మహాత్ములు లోకోద్ధరణ కొరకై అవతారం ధరించి వస్తారు. వారిని మానవ మాత్రులుగా భావించి పొరపాటు చేస్తున్నాం. వారు పరమాత్మ తత్త్వాన్ని అన్వేషించి అందులోని అమృతాన్ని మనకు అందిస్తారు. మన మనస్సు అతి చంచలం. దానిని స్థిరం చేయాలంటే సదాశివుని ఈ విధంగా ప్రార్థించాలి:

**సదా మోహాటవ్యాం చరతి యువతీనాం కుచగిరౌ**

**నటత్యాశాశాఖాన్ వటతి ఝుటతి స్వైరమ్ అభితః ।**

**కపాలిన్ భిక్షోమే హృదయకపిమ్ అత్యంత చపలం**

**దృఢం భక్త్యా బద్ధ్వా శివ భవదధీనం కురు విభో ॥**

శివానంద లహరిలో శ్రీ శంకరాచార్యులవారు, " శంకరా! నా దగ్గర మనస్సనే కోతి ఉంది. అది విషయాలనే కొమ్మలమీద స్వైర విహారం చేస్తోంది. నువ్వు భిక్షాటన చేసేటప్పుడు నా మనస్సనే కోతిని నీ వద్ద వుంచుకో. దానిని భక్తి అనే పాశాలతో దృఢంగా బంధించి ఉంచు. నీకు

భిక్షం దొరుకుతుంది. నాకు నిన్ను స్మరించటానికి అడ్డు లేకుండా వుంటుంది." అని వేడుకుంటున్నారు.

భగవంతుడిని దృఢంగా విశ్వసించాలి. మనస్సును భగవంతుని దివ్య చరణారవిందాలపై నిలపాలి. ఇప్పుడు ఈ భీమవరంలో అటువంటి శ్రీ సోమేశ్వర పార్వతుల కళ్యాణ మహోత్సవం జరగబోతోంది. ఆయన బావగారైన శ్రీ జనార్ధన స్వామి వారు వేంచేసి ఉన్నారు.

శ్రీ గురుదేవులు నిర్మలాంతఃకరణను ప్రసాదించి, అటువంటి పరమేశ్వర సాన్నిధ్యం మనందరికి నిరంతరం కలుగజేయాలని శ్రీగురుదేవులను ప్రార్థిస్తున్నాను.

## *భక్తులకు విన్నపము*

శ్రీ సద్గురునాధుని దివ్య చరిత్ర ఇప్పటికి 2 భాగములు -1వ భాగం 2005లోను, 2వ భాగం 2011లోను వెలువడినవి. వీటిని శ్రీ విజయేశ్వరానంద ప్రసాద్ వారు గ్రంథస్థం చేశారు. ఇప్పుడు మనం 2020 సంవత్సరంలో ఉన్నాం. గడచిన ఈ 16 ఏళ్ళకాలంలో శ్రీగురుదేవులు, గురుస్థానంలో విరాజిల్లుతున్న "అమ్మ" తమ కృపా కటాక్షాలను మనందరిపై వెదజల్లి మనలను సంరక్షిస్తున్నారు. బాబూజీ అవతార సమయంలో, అమ్మ రక్షణలో భక్తులు పొందిన దివ్యానుభవాలను ఆధ్యాత్మికతతో జోడించి పోస్ట్‌లోగాని, email లోగాని, ramuchitti@yahoo.com/ cvrbabu41@gmail.com కి ముందుగా పంపండి. ఆ తరువాత మాకు వాటి పూర్తి వివరణను ఇస్తే, ప్రచురణార్హమైనవి, అమ్మ అనుజ్ఞతో "శ్రీ సద్గురునాధుని దివ్య చరిత్ర" (3వ భాగం) గా ప్రచురణ చేయటం జరుగుతుంది. కావున భక్తులు గమనించి అమ్మ తలపెట్టిన "గురుకార్యా"న్ని విజయవంతం చేయమని ప్రార్థిస్తున్నాము.

## రామాయణంలో స్త్రీ పాత్రలు

# స్వయంప్రభ

- సుషమ్నా ప్రసాద

వానరులు దప్పిక తీర్చుకోవడానికి పక్షులు వస్తున్న బిలం చూసి, అందులోనికి ఒకరిని పట్టుకుని మరొకరు ప్రవేశించారు. అక్కడ బంగారు చెట్లు, బంగారు లతలు, బంగారు భవంతులు మరియు వెండి మేడలు కిటికీలకు ముత్యాల వలలు వున్నాయి. ఆ వన శోభను వానరులు తిలకిస్తుంటే అక్కడ ఒక వనదేవతలా వున్న స్త్రీ కనిపించింది. ఆమె గొప్ప తపస్వినిలాగా వున్నది. నార చీరను ధరించింది. జింక చర్మము చుట్టుకున్నది. ఆమె పేరు స్వయంప్రభ. మేరు సావర్ణి కుమార్తె.

ఆ పసిడి వనాన్ని చూసి ఆశ్చర్యపోయిన వానరులకు మధుర ఫలాలను, చక్కని పానీయములనిచ్చి ఆకలిదప్పికలను తీర్చింది ఆమె. వానరాగ్రేసరుడు ఆమెను ఆ వన చరిత్రను గురించి ప్రశ్నించాడు. 'ఈ ప్రదేశంలో మయుడనే గొప్ప మాయావి వుండేవాడు, అతనే ఈ అద్భుత వనాన్ని సృష్టించాడు అని చెప్పింది. ఆ మయుడు బ్రహ్మదేవుని గురించి ఘోర తపస్సు చేసి, వరాన్ని పొందాడు. కుబేరుని సంపదను పొందాడు. ఆ మయునకు హేమ అనే అప్సర స్త్రీ యందు ఆసక్తి కలిగింది.. ఆ విషయాన్ని గ్రహించిన ఇంద్రుడు ఆ మయుడిని వజ్రాయుధంతో వధించాడు. ఈ వనాన్ని బ్రహ్మదేవుడు హేమకు ప్రసాదించాడు. ఆ హేమకు నేను స్నేహితురాలిని. ఆమె నాకు ఈ వన సంరక్షణ భారాన్ని అప్పగించింది' అని స్వయంప్రభ వివరించింది.

ఆమె వానరులను 'మీరు ఏ కార్యం కోసం ఇక్కడకు వచ్చారు?' అని అడిగింది. వారు 'సీతాన్వేషణ కోసం వచ్చాము' అని చెప్పారు. ఈ వనాన్ని వాల్మీకి మహద్వనం అన్నాడు. హనుమంతుడు ఆ బిలం నుండి బయట పడటానికి స్వయంప్రభ సహాయాన్ని అర్థించాడు. ఆ బిలంలోకి ప్రవేశించినవారు ఇహ బయటకు పోలేరని చెప్పింది. ఆమె వారందరినీ కనులు మూసుకోమని చెప్పి, ఆ బిలాన్ని దాటించింది.

ఆమె వారికి ప్రస్రవణ పర్వతము చూపించి, దూరంగా వున్న సముద్రాన్ని చూపించి, వారికి శుభము కలగాలని ఆశీర్వదించి, తాను తన స్వస్థలానికి చేరుకుంది.

ఆ విధంగా స్వయంప్రభ వానరుల సీతాన్వేషణకు సహకరించి, కథను మలుపు తిప్పింది. స్వయంప్రభకు, శబరికి చాలా దగ్గర పోలికలు వున్నాయి. ఇద్దరూ ఏకాంత జీవనం చేసినవారే. ఇద్దరూ గొప్ప తపస్వినులే. శబరి మాతంగ మహర్షి శిష్యురాలిగా, మాతంగ వనాన్ని పరిరక్షిస్తే, స్వయంప్రభ మయుడు నిర్మించిన మహద్వనాన్ని సంరక్షించింది.

శబరి పేరులో శ - తపో శక్తి, బ - ఆత్మ బలము, రి - రిపులు అంటే అరిషడ్వర్గాన్ని జయించినది అని అర్థము. గురువాజ్ఞను పాటించి, తన జీవితాన్ని ధన్యం చేసుకున్నది శబరి. శబరి రామ లక్ష్మణులకు ఆతిథ్యం ఇస్తే, స్వయంప్రభ అంగద, హనుమదాదులకు ఆశ్రయం ఇచ్చింది. వీరిద్దరూ నిస్వార్థ తపస్వినులు. శబరి రామునికి సుగ్రీవుని కలవమని సలహా ఇస్తుంది. స్వయంప్రభ మూలకథను ఒక మలుపు తిప్పింది.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**జూన్ 2020**

5 శుక్ర - జ్యేష్ట పౌర్ణమి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

15 సోమ - శ్రీగురుదశమి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

21 ఆది - అమావాస్య సూర్యగ్రహణం ఉదయం 10-25ని॥ నుండి మధ్యాహ్నం 1-54ని॥ వరకు (మృగశిరా నక్షత్రం, మిధునరాశి)

**జులై 2020**

1 బుధ - తొలిఏకాదశి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

5 ఆది- ఆషాఢ పౌర్ణమి (గురు పౌర్ణమి) - ఉ॥11 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

15 బుధ - శ్రీగురుదశమి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

# దేవుడు - దర్జీ

-కే.శే. సుశీలా ప్రసాద

వంగ దేశాన్ని కృష్ణకాంతుడనే మహారాజు పరిపాలించేవాడు. ఆయన దగ్గర విష్ణుచిత్తుడనే ఆస్థాన విదూషకుడు వుండేవాడు. ఒకరోజు పారశీదేశం నుండి మహమ్మదు ఒకడు కృష్ణకాంతుని సభకు వచ్చి, 'మహారాజా! నా పేరు షేక్. ఫరీద్. నేను అన్ని మత గ్రంథాలను చదివాను. నాకు ఖురాను, భాగవత, రామాయణ, మహాభారతాలు కూడా క్షుణ్ణంగా తెలుసు. మీ హిందూ దేవుళ్ళకంటే మా అల్లాయే గొప్పవాడని నేను నిరూపించగలను. మీ సభలోని పండితులు నాతో వాదించవచ్చు' అన్నాడు.

కృష్ణకాంతుని సభలో వున్న పండితులకు అసలు 'ఖురాన్' సంగతి బొత్తిగా తెలియదు. వాళ్ళు ఒకరి ముఖాలు ఒకళ్ళు చూసుకుంటూ కూర్చున్నారు ఏం చేయాలో తోచక. అంతలో విష్ణుచిత్తుడు లేచి నిలబడి, ఫరీద్‌ను నఖశిఖ పర్యంతం ఒకసారి చూశాడు. ఆ మహమ్మదీయుడు పొడవాటి అంగీని ధరించి వున్నాడు. ఈ అంగీ మెడ దగ్గర నుండి పాదాల వరకు వ్రేలాడుతూ వున్నది.

'ఫరీద్‌జీ! దేవుళ్ళ సంగతికేమిగాని, మీరు తొడిగిన అంగీ చాలా బాగుంది. ఇటువంటి వస్త్రం మా వంగదేశంలో మచ్చుకకైనా కనిపించదు' అన్నాడు. ఫరీద్ ఆ మాటలకు పొంగిపోయి, 'ఈ వస్త్రాన్ని మఖమల్ అంటారు. ఇది మా దేశంలో విస్తారంగా దొరుకుతుంది' అన్నాడు గర్వంగా.

'చాలా చక్కగా వుంది. దీన్ని మీరే కుట్టుకున్నారా?' అని అడిగాడు విష్ణుచిత్తుడు. 'ఏం! నేనేమన్నా బట్టలు కుట్టేవాడిననుకున్నారా?' అన్నాడు ఫరీద్ చిరుకోపంగా. 'పోనీ, ఈ అంగీకి ఎంత గుడ్డ పట్టిందో ఖచ్చితంగా చెప్పగలరా?' అడిగాడు విష్ణుచిత్తుడు ప్రశాంతంగా. 'ఇది కుట్టించి సంవత్సరం పైన అయింది. ఎంత గుడ్డ కొన్నానో ఇప్పుడు గుర్తు వుంటుందా? మీకు అంత కొలతలు కావాలంటే పారశీదేశం వెళ్ళి మా దర్జీని అడగండి, చెబుతాడు' అన్నాడు ఫరీద్ చాలా చిరాకుగా.

అప్పుడు విష్ణుచిత్తుడు మాట్లాడుతూ 'సంవత్సరం క్రితం కుట్టించుకున్న మీ అంగీకి ఎంత గుడ్డ పట్టిందో మీకు తెలియదుగానీ, అనాదిగా వుంటున్న భగవంతుడి గురించి మీకు తెలుసని చెబుతున్నారు.

ఇదెలా నమ్మటం ఫరీద్‌జీ! దైవం అనే పదార్థం కాలానికి అతీతమైనది. చావు పుట్టుకలు లేనిది. అనాదిగా వుంటున్నది అని మీకు తెలియదా? ఆదైవం చేత నిన్నగాక మొన్న సృష్టించబడినవారు ఈ మనుషులు. వీరు తయారుచేసినవీ మత గ్రంథాలన్నీ. మనుషులు సృష్టించిన ఈ చిల్లర దేవుళ్ళు యదార్థమెలా అవుతారు?

దేవుడు ఒక్కడే. అతడు దర్జీవంటివాడు. దర్జీ మీకు అంగీ, నాకు చొక్కా, మరొకరికి జుబ్బా కుడతాడు. అలాగే దేవుడు మనలను విభిన్న ప్రకృతులతో తయారు చేసి, ఈ లోకంలోకి పంపించాడు. మీరు తొడుక్కున్న అంగీ చిరిగిపోతే మీరు ఏం చేస్తారు? అసహ్యించుకుని అవతల పారవేస్తారు. అలాగే మీలో వున్న ఆత్మ, ఈ శరీరం వృద్ధాప్యం వలన చితికిపోయి నశించిపోతే, మరొక శరీరాన్ని తొడుక్కుంటుంది. మీరు తొడుక్కున్న అంగీకి ఎంత గుడ్డ పట్టిందో దర్జీకి తెలిసినట్లు, మీ సంగతి భగవంతుడికి ఒక్కడికే తెలుసు. కానీ, ఆ భగవంతుడు ఎవరో, ఎక్కడ వుంటాడో, ఎలా వుంటాడో, యింతవరకూ ఎవరూ కనిపెట్టలేక పోయారు. ఎవరికైనా, ఎన్నడైనా అర్థంకాని పదార్థం వున్నది అంటే అది పరమాత్మ ఒక్కటే!

అటువంటి పరమాత్మ ఒక్కడే అని గ్రహించిన మీరు ఆయన గురించి వాదించగలరా? అది మీకు సాధ్యమా? సాధ్యమైతే చెప్పండి, నేను కూడా మీతో వాదించడానికి సిద్ధంగా వున్నాను' అన్నాడు.

శ్రీ సద్గురు యువ సేవా సమితి వారు నిర్వహించిన సేవాకార్యక్రమాలు





# అడిభర్త

-కీ.శే. మద్ది నాగేశ్వరరావు

పూర్వం పాండ్య మండలంలో అడిభర్త అనే జాలరి వుండేవాడు. అతడు ప్రతిరోజూ శివుడిని పూజించిన తరువాత భార్యతో కలసి వేటకు వెళ్ళేవాడు. వేటాడిన చేపలలో మొదటి చేపను మాత్రం చంపకుండా శివార్పణం అని తిరిగి నీళ్ళలోకి వదిలివేసేవాడు. ఇలా చాలా సంవత్సరాలు గడిచిపోయాయి.

ఒకనాడు అడిభర్త వల తీసుకుని మామూలుగానే భార్యతో కలసి వేటకు పోయాడు. వలను నీళ్ళలోకి విసిరాడు. వల లాగగానే ఏదో ధగధగమని మెరుస్తూ కనిపించింది. చూస్తే, అది బంగారు చేప! దాన్ని చూస్తూనే ఒడ్డున కూర్చున్న అతని భార్య 'ఇవాళ్టితో మన దరిద్రం తీరిపోయింది' అన్నది.

'వెఱ్ఱి మొఖమా! ఇది మనదెలా అవుతుంది? నా నియమం నీకు తెలుసు కదా! వేటలో నాకు మొదట దొరికిన వస్తువు శివునికే అర్పణం' అని భార్యతో చెప్పి, వలలో నుండి ఆ బంగారు చేపను చేతిలోకి తీసుకుని, 'శివార్పణం' అంటూ తిరిగి దానిని నీళ్ళలోకి వదిలివేశాడు. అడిభర్త మళ్ళీ వల విసిరాడు. కాని, ఆ రోజు వలలో ఏమీ పడలేదు.

'చూశావా! నీ బుద్ధి తక్కువతనం వలన మనం పస్తు వుండవలసి వచ్చింది' అంటూ అతని భార్య అతనిని నిందించింది. 'పిచ్చిదానా! ఋషులు సంవత్సరాల తరబడి పస్తులుండి తపస్సు చేశారు. ఒక్క పూటకే ఇంత భయమా! బంగారం మీద వ్యామోహంతో సీతా మహాసాధ్వి కూడా రామచంద్రుడిని లేడివెంట పంపి కష్టాలు కొని తెచ్చుకుంది. మనకెందుకీ బంగారు చేప' అన్నాడు అడిభర్త.

మరునాడు అడిభర్త మళ్ళీ వేటకు వెళ్ళాడు. ఆ రోజు కూడా మళ్ళీ ఆ బంగారు చేప మొదట వలలో పడింది. అడిభర్త శివార్పణం అంటూ మళ్ళీ నీళ్ళలోకి వదిలిపెట్టాడు. తిరిగి వల వేస్తే ఏమీ పడలేదు. ఆ రోజు కూడా పస్తు వుండవలసి వచ్చింది. ఇలా ఏడు రోజులు గడిచాయి. ఏడు రోజులూ పస్తులు వుండవలసి వచ్చింది. అయినా కూడా అడిభర్త నిరుత్సాహ పడలేదు. ఇది శివ పరీక్ష అనుకున్నాడు.

ఎనిమిదవ రోజు వల వేస్తే మళ్ళీ అదే బంగారు చేప వలలో పడింది. దాన్ని శివార్పణం అని నీళ్ళలోకి వేశాడు. తిరిగి వల వేస్తే మళ్ళీ అదే చేప వలలో పడింది. అలా ఆరోజు ఎన్నిసార్లు వల విసిరినా అదే చేప వచ్చి పడుతోంది. శివార్పణం చేసిన చేపను నేను మళ్ళీ ఎలా తిరిగి తీసుకుంటాను అనుకుని అడిభర్త ఆ సరస్సును వదిలి వేరే సరస్సుకు వేటకు పోయాడు.

అదేమి చిత్రమో తెలియదు కాని, ఏ సరస్సుకు వెళ్ళినా అదే బంగారు చేప వలలో పడసాగింది. అప్పుడు అడిభర్త చిరునవ్వు నవ్వి, 'స్వామీ! నీకిచ్చిన సొమ్మును నేను తిరిగి ముట్టనని నీకు తెలుసు. ఈ సారి మళ్ళీ ఈ చేప వచ్చి నా వలలోపడి నా కంట పడిందంటే, నేను నా వలను శాశ్వతంగా ఇక్కడే వదిలిపెట్టి, నీవు నా దగ్గరకు వచ్చేవరకు ఇక్కడే వేచి వుంటాను' అని శపథం చేసి వల విసిరాడు.

ఈ సారి వల చాలా బరువుగా వుంది బయటకు లాగుతుంటే. తీరా చూస్తే పార్వతీపరమేశ్వరులు సగుణరూపంలో వలలో చిక్కి దర్శనమిచ్చారు. అడిభర్తకు దర్శనమివ్వటమేకాక, ఎన్నో వరాలను ప్రసాదించి మరీ వెళ్ళారు. నేటికీ తమిళులు అడిభర్తను నాయనారుగా కొలుస్తూ వుంటారు.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా జూన్ , జులై 2020 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోనండి.

***జూన్ 2020:*** AS 6465, 7130, 7133, 7387, 7781.

***జులై 2020:*** AS 3728, 6374,6405, 6409, 6716, 6887, 7467, 7953, 7954,
AS 7955, 8146, 8147, 8148, 8151, 8152, 8157.

# మాణిక్య వాచకర్

-కీ.శే. వి. చిరంజీవి

క్రీ.శ 4వ శతాబ్ధంలో అరిమధన పాండ్యుడు మధుర రాజధానిగా పాండ్యరాజ్యాన్ని పరిపాలిస్తూండేవాడు. తిరువండపూర్ అనే గ్రామంలో నివసిస్తున్న, వేదవేదాంగ పారంగతుడైన తిరువడపూరర్ అనే బ్రాహ్మణుడిని తన ప్రధానమంత్రిగా నియమించాడు.

కొంతకాలానికి తిరువడపూరర్‌కి రాజకీయాలలో ఆసక్తి సన్నగిల్లింది. శివపంచాక్షరీ మంత్రాన్ని వివరించగల మహాపురుషుని కోసం ఆయన అన్వేషించసాగాడు.

అది అలా వుండగా, ఆ రాజ్యానికి శ్రేష్టమైన అశ్వాలు అమ్మకానికి వచ్చాయని రాజుకు తెలిసింది. వెంటనే ప్రధానమంత్రిని పిలిచి, అతనికి విశేష ధనాన్నిచ్చి ఆ అశ్వలాను కొనుగోలు చేయమని పంపించాడు.

పరమశివుడు 'జ్ఞాని' వేషధారియై, ప్రమధగణములను తన శిష్యుల రూపంలో తన చుట్టూ కూర్చోబెట్టుకుని, ఒక చెట్టు క్రింద కూర్చుని ఉపదేశమిస్తున్నట్లుగా దర్శనమిచ్చాడు. తిరువడపూరర్ తన కర్తవ్యం మరచిపోయి, ఆ జ్ఞానిని సమీపించి, తనను శిష్యునిగా స్వీకరించి, అనుగ్రహించమని ప్రార్ధించాడు.

మాయా రూపంలో వున్న శివుడు అతని ప్రార్ధనను మన్నించాడు. భగవంతుని కీర్తిస్తూ, తిరువడపూరర్ ఎన్నో మధుర గీతాలను రచించి, గానం చేశాడు. అప్పటి నుండి ఆ గీతాలు 'మాణిక్యము'లవంటివని, ఆ రచించిన వాడు 'మాణిక్యవాచకర్' అని అతనికి బిరుదునిచ్చి కీర్తించారు.

మాణిక్యవాచకర్ అశ్వములు కొనుగోలు చేయడానికి తన ప్రభువు ఇచ్చిన సొమ్ము యావత్తు గురుదక్షిణగా సమర్పించాడు. ఈ సొమ్ముతోనే తిరుపందే ఆలయం పునర్నిర్మాణం జరిగింది.

తన మంత్రి చేసిన దుర్వినియోగం ఆ రాజుకు తెలిసింది. వెంటనే రాజు అతనిని తన దగ్గరకు పిలిపించి, తాను ఇచ్చిన ధనం గురించి ప్రశ్నించాడు. మాణిక్యవాచకర్ ప్రభువుతో తాను గుఱ్ఱాలు కొన్నానని, అవి కొలది రోజుల్లోనే అక్కడకు వస్తాయని చెప్పాడు.

అతను చెప్పిన రోజుకు గుఱ్ఱాలు రాలేదని, రాజు అతనిని కారాగారంలో బంధించాడు. కారాగార విముక్తికై పరమశివుణ్ణి వేనోళ్ళ ప్రార్ధించాడు మాణిక్యవాచకర్.

అతని భక్తికి ముగ్ధుడైన పరమశివుడు అడవిలోని గుంట నక్కలన్నిటినీ గుఱ్ఱములుగా మార్చివేసి, ఆ రాజ్యానికి పంపించాడు. రాజుగారు అతనికి విముక్తిని కలిగించారు.

రాత్రి అయ్యేసరికి ఆ గుఱ్ఱాలన్నీ తిరిగి గుంటనక్కలుగా మారి, ఆ రాజ్యంలోని వారిని విపరీతంగా బాధించేవి. రాజు మళ్లీ మాణిక్య వాచకర్‌ను పిలిచి సమాధానం అడిగాడు. అతడు తిరిగి సదాశివుని ప్రార్థించగా, శివుడు రౌద్రుడై ఆ రాజ్యంలోని వైగై నది పొంగి వరదలు వచ్చేలాగా చేశాడు. అప్పుడు రాజు తన తప్పును తెలుసుకుని వాచకర్‌ను క్షమించమని వేడుకున్నాడు.

మాణిక్యవాచకర్ తన మంత్రిపదవికి రాజీనామా చేసి, తిరుపెందురై శివుని కీర్తిస్తూ అనేక గీతాలు రచించాడు. శివుని ఆదేశం మేరకు పలు పుణ్యక్షేత్రాలు దర్శించి, చివరకు చిదంబరం చేరుకున్నాడు. చిదంబర్ నటరాజస్వామి బ్రాహ్మణ వేషధారియై వాచకర్‌ను సమీపించి 'నీ పాటలన్నీ నేర్చుకోవాలనే ఆశతో వచ్చాను. మెల్లిగా చెబితే అవన్నీ వ్రాసుకుంటాను' అని చెప్పాడు.

మాణిక్యవాచకర్ చెప్పగా ఆ బ్రాహ్మణుడు అవన్నీ తన పుస్తకంలో వ్రాసుకుని తన చేవ్రాలు చేసి అంతర్ధానమయ్యాడు. మరునాడు ఆలయంలోకి అర్చకులు ప్రవేశించగా, వెయ్యిపాటలు ఒక్క అక్షరం కూడా తేడా లేకుండా మాణిక్యవాచకర్ గీతాలన్నీ గల గ్రంథం స్వామి సన్నిధిలో గర్భగుడిలో పడి వున్నది. వారంతా కలసి మాణిక్యవాచకర్ దగ్గరకు వెళ్ళి విషయం తెలిపి, దీని అర్థం తెలియజేయమని కోరగా, ఆయన 'అన్నిటికీ ఆ నటరాజ స్వామియే సభాపతి' అని చెబుతూ అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తుతూ ఆ నటరాజస్వామి విగ్రహంలో లీనమైపోయాడు.

మాణిక్యవాచకర్ గీతాలన్నీ 'తిరువాచకం'గా కూర్చబడినవి. తిరువాచకం కాకపోతే మరేదీ హృదయాన్ని కదిలించ లేదు అనే సామెత తమిళదేశంలో బహుప్రచారంలో వున్నది.

ప్రఖ్యాత భక్తుడు మహాకవి మాణిక్యవాచకర్ ఆదిశంకరుల వలె ముప్పదిరెండు (32) సంవత్సరాలు మాత్రమే జీవించారు.

# శ్రీ సద్గురు వాణి

(గత సంచిక తరువాయి) సేకరణ - డా॥ రాఘవేంద్ర రావు. పి.

తన లక్ష్యార్థమేదో ఆ లక్ష్యార్థాన్ని సాధించేవరకు భక్తుడు తహతహలాడాలి. రైతు పొలంలో కాల్వ త్రవ్వి నీరు పెట్టాడు. ఎండెక్కినా, కొడుకు అన్నం తెచ్చినా ఆ దృష్టిలో లేడు శ్రమ పడుతున్నప్పుడు. కానీ నీరు వస్తుంటే చూసి 'ఆహా! నా పొలం చక్కగా పండుతుంది. దేనికీ లోటు వుండదు' అని ఆనందిస్తాడు. అప్పుడు కొడుకును చూసి సంతోషంగా భోజనం చేస్తాడు. అలాగే భక్తుడు కాలాన్ని మరచి ధ్యానాన్ని చేయాలి. జ్ఞాన తీర్థం, భక్తి అనే బోదెమ్మట తీసుకుంటేనే భక్తుడికి పరమ శాంతి లభిస్తుంది. మనకు, భగవంతునికి మధ్య అడ్డంగా వున్న ఎత్తుపల్లాలను తీసి, రామనామ తీర్థం మన హృదయంలోకి పారిన తరువాత శాంతి లభిస్తుంది.

భగవత్తీర్థం జ్ఞాన విజ్ఞాన యోగానుభవం అందిస్తుంది. గురుపాద తీర్థానికి మించిన తీర్థం లేదు. నదులన్నీ సముద్రం, సముద్రాలన్నీ గురుపాద తీర్థం అయింది. బ్రహ్మ ఎనిమిది కన్నులతో స్వామి దర్శనాన్ని ఆస్వాదిస్తూ, 'జీవుడికి సర్వ బంధ ప్రముచ్యతే అంటే జీవ భ్రాంతి కలిగించే, అజ్ఞాన ద్వైతము, అవిద్య కర్మను తొలగించి ఆనందాన్ని ప్రసాదించే దివ్య పాదపద్మములా! ఆహా! ఏమి నా అదృష్టం! బ్రహ్మలోక మంతా, దేవలోకమంతా వారు దర్శించినంత మాత్రనే వారు తరించారు. నీ దివ్య పాదపద్మములు ఎంత తేజస్సు! సర్వ వేదములు వర్ణించలేనట్టివి. ఏ మానవుడు తన హృదయంలో దివ్య పాదములను అలంకరించడో అతని బ్రతుకు ఎందుకు? మురికి గుంటకు అతని హృదయానికి ఏమిటి తేడా?'

తనను పవిత్రంగా మార్చి దివ్యత్వాన్నిచ్చేటటువంటి ఆ దివ్య పాదమును మనస్సు అనే పుష్పం చేత పూజించాలి. ఆ దివ్య పాదము బ్రహ్మలోకమంతా సుఖవంతంగా మార్చివేసింది. ఆ అమృతాన్ని పొందారు కనుకనే చావులేని స్థితిని పొందారు. వారందరి కంటే మానవ జన్మ ఇంకా గొప్పది. మానవత్వం లోని సత్యత్వాన్ని వెతుక్కుంటూ సరియైన గురుదేవుని వెతుక్కోవాలి.

# ఎవరు గొప్ప ?

- సుషుమ్నా ప్రసాద

ఆ తీర్పుకు ఇంద్రియాలన్నీ సంతోషించి, కట్టుబడ్డాయి. ప్రధమంగా వాగీంద్రియము (మాట) దేహాన్ని విడిచి పెట్టి, ఒక సంవత్సర కాలంపాటు దేశ సంచారానికి వెళ్ళింది. వాక్కు తగాదాలకి మూలము కదా. వాక్కే వివాదాన్ని పరాకాష్టకు చేరుస్తుంది. ఈ సంవత్సరం పాటు దేశదేశాలు తిరిగి అనేక వాగ్వివాదాలలో పాల్గొని, అనేక ప్రమాణ పత్రములను స్వీకరించి సగర్వంగా తిరిగి వచ్చింది. తాను లేకపోయేసరికి ఈ శరీరం నిర్వీర్యమై పోతుంది అనుకుంది. పిట్ట గూటికి తిరిగి రాగానే పిల్లపిట్టలు అన్నీ దాని దగ్గరకు చేరినట్లుగా, తాను శరీరంలోకి తిరిగి రాగానే మిగతా ఇంద్రియాలన్నీ తనకు తలవంచి, తన రాకకు ఎదురు చూస్తూ, సంతోషించి జేజేలు కొడుతూ తనను స్వాగతిస్తారు కదా అనుకుంది వాగీంద్రియము. కానీ ఇక్కడ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది.

ఇక్కడ శరీరంలో మిగతా ఇంద్రియాలన్నీ తమ పనులన్నీ తాము నిర్వహిస్తున్నాయి. శరీరం తేజో విహీనం కాలేదు. తన రాకను అసలు ఎవరూ పట్టించుకోలేదు. దానితో వాక్కు దానిలో అది కుమిలిపోయింది. వాగీంద్రియము యొక్క దర్పమంతా అణగారిపోయింది. ఇహ తానే పూనుకుని, 'ఓ ఇంద్రియములారా! నేను లేకపోతే మీ పనులు ఎలా జరుగుతున్నాయి?' అని ప్రశ్నించింది. దానికి మిగతా ఇంద్రియాలన్నీ 'నీవు లేకపోయినా మూగవాడు మాటలు రాకపోయినా తన పనులు తాను నిర్వర్తించుకుపోతున్నాడు. నీవు లేని లోటు ఏమీ లేదు మాకు. మా పనులేమి ఆగిపోలేదు' అని మిగతా ఇంద్రియాలు సమాధానం ఇచ్చాయి. దానితో వాగీంద్రియము సిగ్గుతో తన పొరపాటును తెలుసుకొని ఆ శరీరనిర్వహణలో యధా స్థానాన్ని తిరిగి చేరుకున్నది.

వెంటనే దృశ్యాలన్నిటినీ తిలకించే నయనేంద్రియము (కన్ను) తనలో తాను ఇలా అనుకున్నది 'ఈ వాగీంద్రియము తెలివి లేక దాసోహమన్నది. నేను అలా కాదు. ఎందుకంటే వ్యక్తికి చూపు లేకపోతే, జగత్తంతా అంధకారమయమే కదా. దేనినీ చూడలేడు. ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించలేడు. అంతా చీకటి మయమై శరీరం నిర్వీర్యమైపోతుంది కదా' అని గర్వంతో విఱ్ఱవీగుతూ ఒక సంవత్సర కాలంపాటు ఈ దేహాన్ని

విడిచిపెట్టి, దేశాటన చేసి విజయగర్వంతో తిరిగి వద్దామనుకొన్నది.

ఈ శరీరాన్ని విడిచి ప్రకృతిలో సౌందర్యాలన్నింటినీ తిలకించి, ప్రపంచంలోని ఏడు వింతలనూ, దేశవిదేశాలలోని అనేక సౌందర్య దృశ్యాలను తిలకించి పులకిస్తూ, సగర్వంతో తిరిగి వచ్చాయి నేత్రాలు. ఇక్కడకు వచ్చి శరీరాన్ని చూసేసరికి నేత్రాలను విప్పార్చుకుని చూసినా కూడా వాతావరణంలో ఎలాంటి మార్పులేకుండా, ఎవరి పనులు వారు చేసుకుపోతున్నారు. తన కలలన్నీ కలలుగానే మిగిలిపోయాయి అని బాధపడతూ నయనేంద్రియం కూడా పరాజయం పాలై సిగ్గుతో తలవంచుకున్నది. మిగిలిన అవయవాలతో 'మీకు నేను లేని లోటు అసలు స్ఫురించలేదా? మీరు మీ పనులు ఎలా చేసుకుపోతున్నారు?' అని ప్రశ్నించింది. దానికి ఆ మిగతా ఇంద్రియాలన్నీ కలసి 'ఇందులో ఆశ్చర్యమేమున్నది? ఒక గ్రుడ్డివాడు తన పనులన్నీ తాను స్వయంగా చేసుకోవటం లేదా! అలాగే ఇదీనూ. చక్షువులు లేనంత మాత్రాన శరీరం నిర్వీర్యం అయిపోలేదు' అన్నాయి. అప్పుడు నయనేంద్రియము పరువుపోయి తల వంచుకుని, తన స్థానాన్ని తాను చేరుకుంది.

ఇప్పుడు కర్ణేంద్రియము (చెవి) వంతు వచ్చింది. వాక్కు, నేత్రము పరాజయాలను చూసినా కూడా, అవేవీ తనతో సమానం కాదనే అహంకార పరాకాష్ఠలో చెవి తాను విజయ పతాకం ఎగురవేయగలనన్న గర్వంతో శరీరాన్ని విడిచిపెట్టి ఒక సంవత్సర కాలంపాటు దేశాటనకు బయలుదేరింది. ఎంతో మధురమైన గీతాలను విని, పులకించి, పలు భాషలతో పరిచయం చేసుకుని, దేశంలోని ఉత్కృష్టమైన పురాణాలను, కావ్యాలను విని, వాటి అంతరార్థాన్ని గ్రహించి, ఎంతో సంతృప్తితో తాను లేని లోటు మిగతా ఇంద్రియాలకు బాగా తెలిసివచ్చి వుంటుందని ఊహించుకుంటూ వచ్చింది కర్ణేంద్రియము. కానీ తీరా ఇక్కడకి వచ్చి చూశాక ఎప్పటిలాగే వేటి పనులు అవి చక్కగా చేసుకుంటున్నాయి. ఆ శరీరం ఏమీ నిర్వీర్యం కాలేదు. లోకంలో చెవిటివాళ్ళు ఎలా తమ పనులు తాము చేసుకుంటారో అలాగే వున్నది. తాను లేని లోటు ఏమీ కనిపించలేదు అక్కడ. అప్పుడు ఆ చెవి సిగ్గుతో తన పరాజయాన్ని ఒప్పుకుని ఎప్పటిలాగే తన స్థానంలో తాను తలవంచుకుని ప్రవేశించింది.

-సశేషం


జల్లెడ
మధుప
ఇప్పటివరకు ఏ భగవంతుని గురించి మాట్లాడుకున్నామో ఆ భగవంతుని మనస్సులో నిలిపి ధ్యానించండి.
1


గురుదేవా! ఎంత ప్రయత్నించినా మా మనసులో ఆ భగవానుడు నిలువక జారిపోతున్నాడు.
2


మీలో ఎవరైనా ఈ
జల్లెడలో నీరు పట్టి
తీసుకురండి.
3


4


ఈ జల్లెడను
కొద్దిరోజులు నదిలో
వేసి ఉంచుతాను.
5


6


7
చూశారా పిల్లలూ! మీ మనసు కూడా ఆ జల్లెడ లాంటిదే. దానికి కూడా ఎన్నో చిల్లులు. అందువలన మీకు ఏకాగ్రత కుదరక భగవంతుడు మీ మనసులో నిలవడు. కానీ కొంతకాలం నదిలో వేసి ఉంచితే ఆ మట్టితో జల్లెడ చిల్లులు పూడి నీరు నిలిచినట్లు మీ మనస్సును కూడా ఎప్పుడూ భగవన్నామంలో ముంచి ఉంచితే దాని చిల్లులు పూడి భగవంతుని శాశ్వతంగా నిలుపుకోగలుగుతుంది.
8

# శార్వరి

-పాలూరి కాళీప్రసాద్

శార్వరి అంటే రాత్రి. అది మామూలు రాత్రి కాదు. మృత్యుఘోష ప్రతిధ్వనించే కాళరాత్రి. ఆ కాళరాత్రి ప్రభావం ఎలా వుంటుందో గత రెండు నెలలుగా చూస్తూనే వున్నాం కదా! రాబోయే సంవత్సరం ఎలా వుండబోతోందో మనకు ముందుగా వికారిలోనే చూపించేసింది. రాత్రికి ముందు వచ్చేది సాయంత్రం కదా! మరి ఆ సాయంత్రానికి పేరు శర్వరి. శర్వరి తరువాత శార్వరి వస్తుందన్నమాట. ఈ శర్వరియే మనకు వికారిగా కనిపించింది. ఉన్నది వున్నట్లుగా కనిపిస్తే దానిని ఆకారం అంటారు. ఉన్నది దానిలాగా కాక మరొక దానిలాగానో, లేక లేనిది వున్నట్లుగానో కనిపిస్తే దానినే వికారం అన్నారు. ఉదాహరణకు ఒక త్రాడు వున్నదనుకోండి, అది మనకు త్రాడులాగానే కనిపిస్తే అది ఆకారం. కానీ, అదే త్రాడు మనకు పాములాగా కనిపించి మనలను భయపెడితే అది వికారమైంది.

అయితే ఈ వికారం పూర్తి వెలుగులోనూ కలగదు, పూర్తి చీకటిలోనూ కలగదు. అది కేవలం సాయంత్రం పూట వచ్చే చీకటి వెలుగుల దోబూచులాటలో, అంటే సంజెచీకటిలో కలుగుతుంది. ఏదైతే లేనిది వున్నట్లుగా కనిపిస్తుందో దానినే 'మాయ' అంటారు. ఈ మాయ ఎవరిది? **'మమ మాయా'** - ఇది 'నా మాయ' అని గీతాచార్యుడు స్పష్టంగా చెప్పాడు. అంటే ఇది విష్ణుమాయ. శర్వరీ కాలంలో కలిగే మాయ. అందుకే విష్ణు సహస్ర నామాలలో **శర్వరీకరః** అని ఒక నామం వుంది. అయితే మనలను తన మాయతో భయ పెట్టేదీ ఆయనే, గీతామృత బోధతో ఆ భయాన్ని పోగొట్టేదీ ఆయనే. **భయకృత్ భయనాశనః** - ఇవి కదా ఆయన నామాలే.

మామూలుగా లోకంలో పగలు రాత్రి ఎక్కువ కాలం వుంటాయి. ఈ సంధ్యా సమయం రోజులో అతి కొద్దిసేపు మాత్రమే వుంటుంది. కానీ, ఆధ్యాత్మికంగా చూసుకుంటే మనం జ్ఞానమనే వెలుగులో ఎంతసేపు గడిపామో తెలియదు కాని, అనేక జన్మల నుండి ఈ సాయం సంధ్యలోనే గడుపుతున్నాము. దానిని మాయ అనండి లేదా అజ్ఞానం అనండి. అందులోనే నిరంతరంగా వుండి, లేని ప్రపంచాన్ని

ఉన్నట్లుగా భావిస్తూ అనేకమైన భావోద్వేగాలకు, సుఖదుఃఖాలకు గురవుతూ, పుడుతూ, చస్తూ బ్రతుకుతున్నాము.

రోజంతా జీవన పోరాటంలో అలసిపోయిన మానవుడికి విశ్రాంతిని కలిగించేది రాత్రి. అలాగే జనన మరణ చక్రభ్రమణంలో అలసిపోయిన ఆత్మకు విశ్రాంతి ప్రసాదించేది జగన్మాత. **జన్మమృత్యు జరాతప్త జన విశ్రాంతి దాయినీ** - అని లలితా సహస్ర నామం చెబుతోంది. అందుకే ఈ రాత్రికి ప్రతిరూపమైన శార్వరి కూడా ఆ అమ్మ స్వరూపమే. శార్వరి అనేది లక్ష్మీదేవి సహస్ర నామాలలో ఒకటి. రోజంతా పనిచేసి అలసిపోయినవాడు రాత్రి చక్కగా నిద్రపోతే మరునాడు మళ్లీ ఉరకలు వేసే ఉత్సాహంతో లేస్తాడు. అదే రాత్రి సరిగా నిద్రపట్టనివాడు లేచాక కూడా నీరసంగానే వుంటాడు. మనోవికారాలతో మహమ్మారి రోగాలతో అలసిపోయిన జనులు ఈ శార్వరిలో కాస్త విశ్రాంతిని పొందితే, ఆ తరువాత ఒక్క గెంతుతో లేస్తారు. అందుకే తరువాత వచ్చేది 'ప్లవ' నామ సంవత్సరం. ప్లవ అంటే గెంతడం. హనుమంతుని ప్లవగోత్తముడు, ప్లవగేంద్రుడు అనే నామాలతో సంబోధన మనకు సుందరకాండలో చాలా సార్లు కనిపిస్తుంది. మనం గెంతబోయేది శుభకృత్ శోభకృత్ అనే వినసొంపైన సంవత్సరాలలోకే. శుభకృత్ ప్రారంభంలోనే మన ఆశ్రమ స్వర్ణోత్సవాలు.

గ్రహాల కూటమి వలనో, నక్షత్రాల గతులు సరిగా లేకనో ఇప్పుడు మనం చూస్తున్నలాంటి గడ్డు పరిస్థితులు వస్తాయని కొందరు చెబుతుంటారు. అయితే ఈ గ్రహాలు, నక్షత్రాలు, దిక్పాలకులు, దేవతలు వీరంతా ఎవరి ఆధీనంలో వున్నారు? ఎవరి ఆజ్ఞమేరకు పని చేస్తున్నారు? **నమ్ర దిక్పాల సీమంతినీ కున్తల స్నిగ్ధ నీల ప్రభా పుంజ సంజాత దూర్వాంకురా శంక సారంగ సంయోగ రింఖన్నఖేందూజ్జ్వలే** - అంటున్నది శ్యామలా దండకం. దిక్పాలకుల భార్యలందరూ ఎంతో వినయ విధేయతలతో ఆ జగన్మాత పాదాలపై తమ శిరస్సులనుంచి నమస్కరిస్తూ వుంటే, సహజప్రకాశవంతులైన ఆ దేవతల శిరోజాలు నల్లగా మెరుస్తూ అప్పుడే చిగురించిన గడ్డి పరకలలాగా కనిపిస్తుంటే ఆ అమ్మ కాలి గోళ్ళు తెల్లటి వెన్నెల కాంతులను వెదజల్లుతూ ఆ పచ్చికను మేయడానికి వచ్చిన లేళ్లలాగా కనిపిస్తున్నాయట. - సశేషం

## శ్రీ సద్గురు యువ సేవా సమితి వారు నిర్వహించిన సేవాకార్యక్రమాలు

శ్రీ కాళీ గార్డెన్స్ ఆశ్రమ యువ సేవా సమితి వారు ఇతర రాష్ట్రాలనుంచి వచ్చిన వలస కార్మికులకు ది.16.05.2020 నుండి అల్పాహారము, మధ్యాహ్న భోజనము, రాత్రి భోజనము షుమారు రోజకు 1000మందికి పెట్టారు. మరియు నంబూరు స్టేషన్ నుంచి రైలులో బయల్దేరే వలస కార్మికులకు కూడా ఉపాహారము ప్యాక్ (బ్రెడ్,పండ్లు, బిస్కెట్లు మంచి నీటి ప్యాకెట్లు) చేసి ఇచ్చారు. యువ సమితి వారు నిర్వహించిన ఈ కార్య క్రమాన్ని కార్మికులు, స్థానీయ అధికారులు అభినందించారు.








(మరికొన్ని దృశ్యములు ప్రక్క పేజీలో)





# చెప్పాలని ఉంది

చెప్పాలని ఉంది, మనసు విప్పాలని ఉంది
భాషలేని భావమేదో, మదిలో మెదులుతోంది
చెప్పలేని బాధ ఏదో, మదిని పిండుతోంది
రూపులేని ఊహ ఏదో మదిని కదులుతోంది

అంతులేని ఆశ ఏదో పురులు విప్పుతోంది
అంతలోనే అలజడేదో మదిని నింపుతోంది
వయస్సులోని కోర్కె ఏదో కుదుపుతోంది
మరువలేని గురుతు ఏదో కులుకుతోంది

మానలేని గాయమేదో మనస్సునంతా కెలుకుతోంది
ఓర్పులేని ఓపికేమో ఒంటి నుంచి ఒలుకుతోంది
మొక్కవోని ధైర్యమేదో మదిని నిండుతోంది
నమ్ముకున్న దైవమొకటే నన్ను నడుపుతోంది.

- పి. నాగేశ్వరరావు

# గుర్వష్టకమ్

(గత సంచిక తరువాయి) - వారణాసి కాళీప్రసాద్ (అమెరికా)

*న భోగే న యోగే న వా వాజి రాజౌ*
*న కాంతా ముఖే నైవ విత్తేషు చిత్తం।*
*గురోరంఘ్రి పద్మే మనశ్చే న లగ్నం*
*తత: కిమ్ తత: కిమ్ తత: కిమ్ తత: కిమ్॥*

ఎటువంటి యోగముల యందు కానీ, భోగముల యందు కానీ, అశ్వరాజముల వంటి ఖరీదైన కానుకల యందు గానీ, కామినీ కాంచనాదుల యందు గానీ మనస్సు విముఖత చూపించినప్పటికినీ, గురుపాదములయందు మనస్సు లగ్నం చేయలేనివాని జీవితం వ్యర్థం.

అష్టకములో ఇప్పటి వరకు పరిశీలించిన శ్లోకాలలో గురుపాద పద్మములు లభించనిదే వ్యర్థమంటూనే మానవులకు అహంకార కారకములైన భోగభాగ్యాలు, కీర్తి ప్రతిష్ఠలు, దాన ప్రతాపాల ప్రసక్తి వస్తుంది. వాటికి భిన్నంగా ఈ శ్లోకంలో మొట్టమొదటిసారి వైరాగ్యాన్ని ధ్వనిస్తూ, ఇహంలోని భోగభాగ్యాలు, సంపదల మీద విముఖత చెంది గురువుకోసం పరితపించడాన్ని తెలియజేస్తుంది. ఇవన్నీ నాకు వున్నాయా అంటూ మొదలయ్యి, వీటితో అవసరం లేదంటూ చివరికి గురువే శరణ్యమన్న ఆవేదనతో కదిలే అష్టకము యొక్క ప్రస్థానాన్ని మనం గమనించ వచ్చు.

వైరాగ్యం గురించి సాంఖ్యయోగంలో శ్రీకృష్ణ భగవానుడు **యదాసంహరతే చాయం కూర్మోంగానీవ సర్వశ:। ఇంద్రియా ణీంద్రియార్థేభ్య: తస్య ప్రజ్ఞాప్రతిష్ఠితా॥** ( భ.గీ. 2/58) - 'తాబేలు తన అవయవాలను చిప్పలోకి ఉపసంహరించినట్లు జ్ఞాని అయినవాడు ఇంద్రియాలను వాటి ప్రయోజనాల నుండి ఉపసంహరించగలుగుతాడు' అని వివరించాడు.

అలాంటి వైరాగ్యానికి భక్తి తోడైనప్పుడు మాత్రమే పూర్ణత్వం సిద్ధిస్తుంది. భక్తి వైరాగ్యాలు రెండూ సాధకుడి పురోగమనానికి ప్రధానమైన అంశాలు. అందుకే వేదాంత పరిభాషలో వాటిని పక్షి యొక్క రెండు రెక్కలతో సమానంగా పరిగణించారు.

**న భోగే న యోగే నవా వాజి రాజౌ** - యోగము అంటే కలయిక అని అర్థం.

అయితే ప్రాపంచికంగా ఎన్నో విషయాలు కూడి భోగభాగ్యాలుగా కనిపించినా, సాధకుడు వాటిని అవరోధాలుగానే భావిస్తాడు. యోగము గురించి నిర్వచిస్తూ భగవద్గీతలో **సమత్వం యోగముచ్యతే** - సమదృష్టి కలిగి వుండటమే యోగము అని చెప్పబడింది. ఆ సమదృష్టి ద్వారానే సాధకుడు సర్వత్రా భగవంతుని దర్శించగలుగుతూ, **త్వమేవాఽహం** అన్న అద్వైతానుభూతిని కూడా చివరికి పొందగలుగుతాడు.

శ్రీ బాబూజీ ప్రసాదించిన **సత్యం - శాంతి - దయ - ప్రేమ** లలో సమదృష్టితో దయ, ప్రేమలను గుర్తించి, తద్వారా శాంతిని పొంది సత్యాన్వేషణలో సాధకుడు కృతార్థుడవుతాడు. అదే నిజమైన భోగమనీ దానిని కేవలం గురుపాద పద్మముల యందు మనస్సు నిలపడం వలనే పొందగలమనీ ఈ శ్లోకం వివరిస్తోంది.

-సశేషం

## చందాదారులకు విజ్ఞప్తి

మీ మాసపత్రిక చందా నెంబరు LM అనే అక్షరాలతో ప్రారంభమయితే మీ చందా గడువు ఇప్పటికే ముగిసినది. అయినా శ్రీగురుదేవుల ఆధ్యాత్మిక సంపద అందరికీ అందజేయాలనే మహదాశయంతో ట్రస్టువారు స్వంత ఖర్చుతో ఇంకా పత్రిక మీకు పంపుతున్నారు. కనుక దయచేసి 1,116 రూలు చెల్లించి మీ చందాను పునరుద్ధరించుకొనవలసినదిగా విజ్ఞప్తి.

## *పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు*

**జూన్ 2020**

5 శుక్ర - జ్యేష్ఠ పౌర్ణమి - శ్రీసద్గురుపాదపూజ.

15 సోమ - శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ.

21 ఆది - అమావాస్య - సూర్యగ్రహణం ఉ॥ 10-25ని॥ నుండి మ॥ 1-54ని॥ వరకు (మృగశిర నక్షత్రం, మిధునరాశి)

**జులై 2020**

1 బుధ - తొలిఏకాదశి - శ్రీసద్గురుపాదపూజ

5 ఆది - ఆషాఢ పౌర్ణమి (గురు పౌర్ణమి) - శ్రీసద్గురుపాదపూజ

15 బుధ - శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ.

# జీర్ణ వస్త్రం

- పాలూరి కాళీప్రసాద్

**వాసాంసి జీర్ణాని యథా విహాయ ।**
**నవాని గృహ్ణాతి నరోఽ పరాణి।**
**తథా శరీరాణి విహాయ జీర్ణాని।**
**అన్యాని సంయాతి నవానిదేహి ॥**

(భ.గీ 2/22)

మానవుడు జీర్ణమైన వస్త్రాన్ని విడచి, నూతన వస్త్రాన్ని ధరించినట్లే జీవుడు జీర్ణమైన దేహాన్ని విడచి, నూతన దేహాన్ని ధరిస్తాడని గీతాచార్యుడు వివరించారు. కానీ, ఇక్కడ ఎంతో వయస్సు వచ్చి, ముసలిదైన దేహం జీర్ణమైనదంటే నమ్ముతాం కానీ, చిన్నవయస్సులో వున్నవారి దేహం కూడా జీర్ణమైపోయిందంటే నమ్మబుద్ధి కాదు. ఇదే విషయాన్ని శ్రీ గురుదేవుల ఆరాధనా మహోత్సవాలలో శ్రీ దండి స్వామివారు విశ్లేషిస్తూ అది భౌతికంగా శరీరం జీర్ణమవడం కాదని, ఆ శరీరం ద్వారా అనుభవించ వలసిన కర్మ ఎప్పుడు జీర్ణమైపోతుందో, అప్పుడా శరీరాన్ని ఆ జీవి వదిలివేస్తాడని వివరించారు.

మనం వస్త్రాల ఉదాహరణనే తీసుకుంటే ఒక నల్లచొక్కా నాలుగైదు రోజులు ధరించినా మాపు తెలియదు. అదే ఇతర రంగు చొక్కాలు రోజంతా ధరించేసరికి మాసిపోతాయి. ఇక తళతళలాడే తెల్లని చొక్కా ఒక్కపూటకే మాసిపోతుంది. అలాగే పాపపు ఆలోచనలతో, నీచ బుద్ధులతో కూడిన మానవుని కర్మ చిరకాలం జీర్ణమవకుండా వుంటుంది. అందుకే **'పాపీ చిరాయుః'** అంటారు. ఇక మంచిచెడుల మిశ్రమ బుద్ధితో వుండే మానవులే మనలో ఎక్కువ శాతం వుంటారు. ఇలాంటి వాళ్లంతా ఏ 80 లేదా 90 సంవత్సరాలో జీవించి శరీరం శిథిలమవగానే మరొక శరీరాన్ని ధరించడానికి తరలిపోతారు.

మరి తెల్లని వస్త్రంలా నిర్మలమైన బుద్ధికలిగి సంచరించే సత్పురుషులు వారి కర్మ త్వరగానే జీర్ణమైపోవడంతో చిన్న వయస్సులోనే దేహాన్ని చాలిస్తారు. మన దగ్గర వుండే వస్త్రాలలో మరొక రకం కూడా వుంటాయి. ఇవి అత్యంత విలువైనవి. వీటిని ఏవో కొన్ని ప్రత్యేక సందర్భాల

కోసం కొనుక్కొని ఆయా సందర్భాలలో ధరించి, ఒకటి రెండు గంటలలోనే విప్పి మళ్ళీ భద్రపరచుకొంటాం. ఇలాంటి విలువైన వస్త్రాల లాంటివారే కారణ జన్ములు. వారిని భగవంతుడు ఏవో కొన్ని ప్రత్యేక సందర్భాలలో మాత్రమే లోకోద్ధరణ నిమిత్తంగా ఉద్భవింపజేస్తూ వుంటాడు. వారు తాము వచ్చిన కార్యం త్వరత్వరగా ముగించుకుని తిరిగి కనుమరుగైపోతారు.

అయితే అలా అని త్వరగా వెళ్ళిపోయిన వారందరూ మహాత్ములనీ దీర్ఘకాలం జీవించిన వారందరూ పాపాత్ములనీ అనుకోవడానికి లేదు. పాపీ చిరాయు: అన్నప్పటికీ చిరంజీవులైన మహాత్ములెందరో మన పురాణాలలోనే కాక ప్రస్తుత కాలంలో కూడా దర్శనమిస్తారు. మళ్ళీ మన వస్త్రం పోలికకే వెడితే కొన్ని దివ్య వస్త్రాలు వుంటాయి. అవి ఎంతకాలమైనా మాయకుండా వుంటాయి. మన సీతమ్మ అటువంటి వస్త్రాన్నే లంకలో వున్నంతకాలం ధరించింది. అలా ఎందరో మహాత్ములు తమ స్వార్థం కోసమో, దేహం మీద మోహంతోనో కాక, కేవలం దీనజనోద్ధరణ కోసం నిస్వార్థంగా కొన్ని వందల, వేల సంవత్సరాల కాలం జీవించి, తమ సుదీర్ఘ జీవితాన్నంతా లోక కళ్యాణం కోసం త్యాగం చేశారు.

కాబట్టి ఎంతకాలం జీవించామన్నది ముఖ్యం కాదు. మన జీవిత కాలంలో ఎంత భాగం సద్వినియోగం చేసుకున్నాం, ఎంత త్వరగా ఈ దేహం యొక్క అశాశ్వతత్వాన్ని గుర్తించి దీని మీది మోహాన్ని వదిలించుకున్నాం అనే దానిపైనే మన జీవిత సార్థకత ఆధారపడుతుంది.

---

**చర్మనేత్రము లేనివాడు చూడలేడు గానీ, గ్రహించగలడు.**
**జ్ఞాన నేత్రము లేనివాడు చూడనూలేడు, గ్రహించనూలేడు.**

**అపహరించజాలని అక్షయ నిధులు సద్విద్య, సత్ప్రవర్తన, సదాచారము, సహనము, సహకారము.**

- శ్రీ బాబూజీ మహరాజ్

# కైవల్యోపనిషత్

- రేఖ

(గత సంచిక తరువాయి)

ఆ ఆత్మయే (అతడే) ఈ మాయా మోహితమైన శరీరంలో ప్రవేశించి, జీవుడుగా సమస్త కార్యాలు చేస్తోంది. జాగ్రదావస్థలో ఆ జీవుడే స్త్రీ ప్రకృతిగతమైన భావనతో, అన్నపానాది విచిత్రమైన వివిధ భోగములను అనుభవించి, సంతృప్తిని పొందుతున్నాడు.

ఆత్మ మాయా మోహితుడు అవడం ఏమిటి? అనే సందేహం రావచ్చు. మనసు ఆలోచిస్తుంది. ఇక్కడే కూర్చున్నప్పటికీ, ఏదో భావన వస్తుంది ఆ మనిషి మనస్సులో. అది బయటకు తెలియదు. కానీ అన్ని కేజీల మనిషిని ఒక్క చిన్న సంకల్పం లేదా భావన వున్న చోటులో నుండి కదలి వెళ్ళేటట్లు చేస్తుంది.

జీవుడు ఆత్మకంటే వేరు అని చెబుతున్నారిక్కడ. ఆత్మకు మాయా మోహాలు అని ఎందుకన్నారంటే, ఇంతకు ముందు మనస్స (సుక్ష్మదేహం) ఏ యే వాసనలతో కూడి వున్నదో, ఆ మనస్సే మళ్ళీ జన్మకు కారణమవుతుంది. అది ఎలా అంటే మనస్సులో కలిగిన భావాలు, వాటి ద్వారా క్రియలు చేస్తున్నప్పుడు బుద్ధిపై పడిన ముద్రలు, ఈ భావాలు కలసి 'మాయ' లేక 'అవిద్య' అనబడుతున్నాయి.

ఈ వాసనలు బుద్ధిలో  కోరికలుగా ప్రవేశించి, మనస్సులోని సంకల్పాలు ఎలా వుండాలి అనే విషయాన్ని శాసించి, నియమిస్తాయి. ఈ వాసనలు ఆలోచనా ప్రవాహమై అంతఃకరణని సృష్టిస్తే, మనోబుద్ధి రూపమైన అంతఃకరణ జీవికి ఎటువంటి దేహం కావాలి, వ్యవహరించడానికి ఎటువంటి పరిసరం కావాలి, అనే విషయాన్ని నిర్ణయిస్తుంది. ఈ వాసనలే కారణ శరీరం, అవిద్య అవుతున్నాయి.

ఈ వ్యష్టిలో వున్నది అవిద్య. దానినే సమష్టిలో మాయ అంటున్నారు.

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**జూన్ 2020**

5 శుక్ర - జ్యేష్ఠ పౌర్ణమి - శ్రీసద్గురుపాదపూజ.

15 సోమ - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

19 శుక్ర - మాసశివరాత్రి

21 ఆది - అమావాస్య. సూర్యగ్రహణం. ఉదయం 10-25 ని॥ నుండి మధ్యాహ్నం 1-54ని॥లు వరకు. (మృగశిర నక్షత్రం, మిధున రాశి)

**జులై 2020**

1 బుధ - తొలిఏకాదశి - శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన, ఏకాహం సంకీర్తన.

5 ఆది - ఆషాఢ పౌర్ణమి (గురు పౌర్ణమి) - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

15 బుధ - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

16 గురు - దక్షిణాయనం ప్రారంభం.

18 శని - శనిత్రయోదశి

19 ఆది - మాస శివరాత్రి

20 సోమ - అమావాస్య

23 గురు - శ్రావణ శుద్ధ తదియ - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ.

31 శుక్ర - వరలక్ష్మీ వ్రతం

*కోరికలు జేబులోని నాణెముల వంటివి. పెరిగే కొలదీ భారం అధికమవుతుంది.

*సంతృప్తికి మించిన ధనం, సత్యమునకు మించిన సద్గుణం లేదు.

*మంచిని మించిన స్నేహితుడు, బ్రహ్మానందమును మించిన ఆనందం లేదు.

- శ్రీ బాబూజీ మహరాజ్

# అగస్త్యుడు

- రమణ ప్రసాద్

భరతఖండంలో జన్మించి తపోమహిమ చేత సృష్టి స్థితి లయ కారకులైనవారే ఋషులు. పరమ పవిత్ర వర్తనులు. అట్టివారిలో అగస్త్యమహర్షి అగ్రగణ్యుడు. వశిష్ట మహర్షికి సహజన్ముడు. మిత్రా వరుణులు ఊర్వశిని మోహించినవారలై లోక సంరక్షణార్థం తమ వీర్యములను ఒక జలకలశములో విడువగా, కాలక్రమంలో ఆ కలశమునుండి అద్భుత తేజస్సులైన అగస్త్యుడు, వశిష్టుడు ఉద్భవించారు. అందువలన వీరికి కుంభ సంభవులని, మైత్రావరుణ పుత్రులని పేరు వచ్చినది.

అగస్త్యుడు బాల్యమునుండియే పరమ నిష్ఠాగరిష్ఠుడై సకల విద్యాపారంగతుడై, దివ్య తేజస్విగా రూపొందాడు. ఒకనాడు అరణ్యంలో తిరుగుతూ వృక్ష శాఖలపైనుండి వ్రేలాడుచుండిన మునీశ్వరులను చూసి, 'మీరెవ్వర'ని అడుగగా, 'మేము పితృదేవతలము. నీవు వివాహము చేసికొని, పుత్రులను, పౌత్రులను కని మాకు ఊర్ధ్వలోకాలు ప్రసాదిస్తావని కొండంత ఆశతో ఉన్నామ'ని చెప్పారు. 'మీ కోరికను తప్పకుండా తీరుస్తాను' అని వాగ్దానం చేశాడు.

పిదప విదర్భరాజు కుమార్తె అయిన లోపాముద్రను వివాహం చేసికొన్నాడు. గంగా తీరాన ఒక ఆశ్రమం నిర్మించుకొని నివసిస్తున్నాడు. అగస్త్యుడు లోపాముద్రతో సంగమము కోరగా, ఆమె సమస్తాభరణాలు, నూతన వస్త్రాలు కోరింది. దానికి కావలసిన ధనం కోసం బ్రధ్నశ్వుడు శ్రుతర్వుడు అను రాజులను అర్థించాడు. వారి దగ్గర సరిపడే ధనం లేనందున వారు మణిమతీపురాధీశుడైన ఇల్వలుడు అనే రాక్షసుని అర్థించారు. అతని తమ్ముడు వాతాపి. అతడు కామరూపి. అతనిని మేకను చేసి వధించి దానిని వండి బ్రాహ్మణునకు భోజనం పెట్టి, 'వాతాపీ బయటకు రా' అని పిలువగా వాతాపి అతని పొట్ట చీల్చుకుని వచ్చేవాడు. ఆ తరువాత వారిరువురూ ఆ బ్రాహ్మణుని వండుకు తినేవారు. ఈ విధంగా వారు చేయుటం పరిపాటి అయింది.

ఈ రోజున తమ వద్దకు వచ్చిన అగస్త్యునికి అదేవిధంగా వాతాపిని మేకను చేసి వండి ఆ మాంసాన్ని అగస్త్యుడికి పెట్టించాడు.

ఇల్వలుడు తమ్ముని పిలిచేంతలో, అగస్త్యుడు "జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం" అనగానే వాతాపి జీర్ణమైపోయాడు. ఇల్వలుడు చేసేదేమీలేక ఇచ్చిన మాట ప్రకారం అపరిమిత ధనం ఇచ్చి అగస్త్యుని పంపాడు. తరవాత ఇల్వలుని వధించుటచేత అతనికి 'వాతాపీల్వలమర్దనుడ'ను పేరు వచ్చింది. పిదప అతని అనుగ్రహం చేత లోపాముద్ర దృఢస్యుడను కుమారుని కన్నది. అతనికి తేజస్వి అనే కుమారుడు కలిగాడు. ఈ విధంగా అగస్త్యుడు పుత్ర పౌత్రులను కని పితృదేవతలకు పుణ్యలోకగతులను ప్రాప్తింపచేశాడు.

రాజర్షి కవేరునికి తాను వరమీయగా పుట్టిన లోపాముద్ర అంశయైన విష్ణుమాయని వివాహము చేసికొని అతనికి మోక్షము లభించేటట్లు చేయుమని బ్రహ్మదేవుడు అగస్త్యుని కోరగా, అతడు సమ్మతించి కవేర కన్యకను వివాహం చేసుకొన్నాడు. వెంటనే ఆమె నదిగా మారిపోయింది. ఆ నదియే కావేరినది. అందులో కవేరుడు స్నానం చేసి సద్యోముక్తిని పొందాడు.

కృతయుగంలో వృత్రుడను రాక్షసుడు కాలకేయాదులతో కలసి ఇంద్రునిపై దండెత్తగా ఇంద్రుడు వృత్రుని సంహరించాడు. కాని కాలకేయాదులు సముద్రంలో దాగి రాత్రులందు బ్రాహ్మణులను చంపి ఆశ్రమాలలో ఉపద్రవాలు సృష్టించారు. ఇంద్రాది దేవతలు విష్ణుమూర్తిని ప్రార్థించగా, "అగస్త్యమహర్షి సముద్రజలాలను పానం చేస్తాడు. అప్పుడు మీరు కాలకేయాదులను వధించండి" అని ఆనతిచ్చాడు. దేవహితార్థమై అగస్త్యుడు సముద్రాన్ని ఆపోశనం పట్టాడు. దేవతలు విజృంభించి కాలకేయాదులను వధించారు. అందువలన అతనికి 'పీత సముద్రుడు' అని పేరు కలిగింది.

-సశేషం

**అజాగ్రత్త కొంచెమైననూ – కీడు అధికము**

- శ్రీ బాబూజీ మహరాజ్

# సింగరిదాసు

సేకరణ - మురళి

సింగరిదాసు భక్తి, జ్ఞాన, వైరాగ్యములు అంతర్వాహినులైన వంశంలో 10-6-1840లో జన్మించాడు. కామరాజు సింగరిదాసు అక్షరాభ్యాసం తరువాత కొద్దికాలం వీధిబడిలో చదివి అనంతరం మేనమామ వద్ద భాగవత రామాయణాలు, సంస్కృతం, ఇంగ్లీషు నేర్చుకున్నాడు. సింగన్నకు ఆయా గ్రంథాల సారాంశం హృదయగతమైంది. భగవంతుడు కరుణామయుడని, ప్రేమ స్వరూపుడని, భక్తపాలకుడని అట్టి భగవంతుని స్మరించుటయే మానవ జన్మకు సార్థకత అని నిశ్చయమైంది.

ఒకరోజు సింగరి గిరిపైన వున్న నృసింహస్వామిని అర్చించి వస్తుండగా బాగా చీకటిపడింది. భక్తి పారవశ్యంతో పాడుతూ వస్తుంటే సెలయేటి వద్ద దివ్యకాంతి దర్శనమైంది. మహాతాపసులకు కూడా దుర్లభమైన జ్ఞానజ్యోతిని దర్శించాడు. తానెంత ధ్యానించినా భగవత్సాక్షాత్కారం కలుగనందుకు చింతిస్తూ ఒకరోజు తీవ్ర ఆవేదన చెందితే మరల జ్యోతి దర్శనమై, ఆ జ్యోతి నరసింహాకృతి దాల్చి దర్శనం ఇచ్చింది. చీకటి పడుతుండగా ఇంటిముఖం పట్టి, ఆలయం దాటుతుండగా సుమారు 40 సంవత్సరాల వయస్సు గల సిద్ధురాలు ఎదురైంది. గతంలో తాను దర్శించిన జ్ఞానజ్యోతి ఈమెయే అని గుర్తించి ఆమెకు సాష్టాంగ పడ్డాడు. కొన్ని రోజుల తరువాత ఆమె సీతాంబ సింగన్నకు రామతారకం ఉపదేశించింది. సింగన్న నిష్ఠతో చేసిన సాధన సిద్ధించింది.

దానధర్మాలు, సంతర్పణలతో సంపద కరిగిపోయింది. సింగరి దాసు ఇష్టం లేకున్నా, ఏదో ఒక ఉద్యోగం చేయవలసి వచ్చింది. మేనమామ రెండుసార్లు ఉద్యోగం ఇప్పించినా, సింగరి అనాసక్తతతో ఆ కొలువులు కోల్పోయాడు. బావగారి (చెల్లెలి భర్త) సహాయంతో పూతల పట్టులో కొంతకాలం ప్రైవేటుబడి నడిపి పిల్లలకు పాఠాలు, పెద్దలకు పురాణ ప్రవచనాలు, రాత్రులు భజనలు చేస్తూ గౌరవ మర్యాదలు, ధనం సంపాదించాడు. 1864 సం॥లో తిరిగి స్వగ్రామం వెంకటాపురం చేరాడు.

భోగాలు అనుభవించవలసిన 25సం॥ సింగరిదాసు కఠినమైన జ్ఞాన మార్గావలంబియై తంబూర మీటుతూ ఆశువుగా భక్తి సంకీర్తనలు

పాడుతూ 35రోజులు నడిచి తిరుమల చేరుకున్నాడు. శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనం చేసుకుంటూ, గోగర్భం ప్రాంతంలో ఒక చిన్నగుహలో సీతాంబ ఉపదేశించిన రామతారకం రాత్రింబవళ్ళు జపిస్తూ వుండేవాడు. మిరుమిట్లు గొలిపే కాంతులతో శ్రీరామచంద్రుని దర్శనం అయింది. రెండు రోజులు అదే భావనలో వుండగా, 'నీవు పుణ్యాత్ముడవు, భక్తుడవు, సిద్ధుడవు. నీ వలన లోకానికి మహోపకారం జరుగవలసి వున్నది. నీవు ఇంటికి వెళ్ళి ఆదర్శ గృహస్థునిగా జీవితం గడుపు' అని సూచన లభించడంతో తిరిగి స్వగ్రామం చేరుకున్నాడు.

అనంతర కాలంలో సింగరిదాసు అనేకమంది శిష్యులకు మంత్ర దీక్ష ఇచ్చి తరింపజేశారు. సింగరిదాసు స్వయంగా పురాణ ప్రవచనాలు, భజనలు చేస్తూ, అనేక ప్రదేశాలు పర్యటిస్తూ ప్రజలను భక్తిమార్గంలో నడిపించారు. భజన చేసే సమయంలో తరచుగా భావసమాధి పొంది నిత్యానంద పరిపూర్ణులై వుండేవారు. చివరి కాలంలో బాపట్లలో తన కుమారుని ఇంటికే చేరి, సన్యాసదీక్ష తీసుకుని, కాషాయం ధరించి, బ్రహ్మానంద సరస్వతి స్వామి అనే నామం పొందారు. 6-6-1916 అర్ధరాత్రి పూట **శ్రీరామ సీతారామ** అనే నామం బిగ్గరగా చేస్తూ రామ సాయుజ్యం పొందారు.

ఒకసారి రామలక్ష్మణులు మంచి ఎండాకాలంలో పంపానది తీరాన కూర్చుని వున్నారు. అదే సమయంలో నదికి సమీపంగా ఒక కాకి దాహం తీర్చుకోవడానికై వచ్చి కూడా నీరు త్రాగకుండా తిరిగి వెనక్కి వెళ్ళిపోవడం మళ్ళా రావడం ఇలా అనేక సార్లు చేస్తోంది. అది గమనించిన లక్ష్మణుడు అర్థంకాక, శ్రీరామునితో 'కాకి అలా ఎందుకు చేస్తోంది?' అని ప్రశ్నించాడు.

దానికి సమాధానంగా రాముడు 'ఆ కాకి నా భక్తురాలు. ఎప్పుడూ నా నామ స్మరణ చేస్తూ వుంటుంది. దాహం తీర్చుకోవడానికి ఉపక్రమిస్తే, రామ నామ స్మరణకు అంతరాయం కలుగుతుందని, అది నీరు త్రాగడానికి ఇష్ట పడటం లేదు' అని తెలియజేశాడు.

- గాలి జగదీష్

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

## శ్రీహరిరావు గారితో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

నా చిన్నపుడు నాతో బాగా పరిచయం ఉన్న యిద్దరు వ్యక్తులు ఆ మధ్య నాకు బెజవాడలో కనిపించారు. అందులో ఒకతను నమస్కరించి నాతో "ఆనాడు మీరు నన్ను 'ఎంతో అభివృద్ధిలోకి వస్తా' వని ఆశీర్వదించారు. మీ అనుగ్రహంతో బిజినెస్‌లో మీరు చెప్పినట్లు నడుచుకొని నేనీనాడు లక్షాధికారినైనాను. అయిదంతస్తుల మేడ కట్టుకున్నాను. మీరు మద్రాసు ఎప్పుడు వచ్చినా దయచేసి మాయింట్లోనే ఉండండి" అన్నాడు.



రెండవ అతను నన్ను చూడగానే లబోదిబో మంటూ కాళ్ళ మీద పడి "అయిపోయింది బాబూ! అంతా అయిపోయింది. ఆనాడు మీరిచ్చిన సలహాలను, హెచ్చరికలను పెడ చెవిన పెట్టాను. 350 ఎకరాల భూమీ, దానితో బాటు నా బ్రతుకూ హుళక్కి అయిపోయింది" అని దు:ఖించారు.

కష్ట సుఖాలు ఒకదాని తరువాత ఒకటి వస్తూనే ఉంటాయి. రాత్రీ, పగలూ ఒకదాని వెనుక ఒకటి రావటం ఎలా తప్పదో మానవుని జీవితంలో కష్ట సుఖాలూ అంతే. కల వలె కరిగిపోయిన కలిమిని మరచిపొండి. కలకాలం నిలిచే కలిమిని నేనున్నానని గుర్తించుకోండి" అని అభయమిచ్చారు.

అప్పటి నుండి శ్రీ బాబు ఏలూరు మీదుగా ఎక్కడికి వెళ్ళినా, ఒక్కసారయినా శ్రీహరి గారింట్లో తొంగి చూసి, చిరునవ్వు చిందించకుండా వెళ్ళేవారు కాదు. శ్రీహరిగారు వారి కుటుంబ సభ్యులు శ్రీ బాబు స్మరణ చేసుకుంటూ, వారి బోధలను నెమరు వేసుకుంటూ అదే మహాభాగ్యమని భావించి జీవించే వారు. శ్రీ బాబు వచ్చినప్పుడల్లా అరమరిక లేకుండా అందరితో కలిసిపోయే వారు. సుశీల చేత పాటలు పాడించే వారు.

ఒక్కొక్కసారి శ్రీ బాబు శ్రీహరిగారింటికి భక్తులతో కలిసి వెళ్ళేవారు. తమ దేవతార్చనను తీసుకుని వెళ్ళిన సందర్భాలు కూడా వున్నాయి. ఆ జానెడు గదిలోనే శ్రీ బాబు ఒక అలమారులో దేవతార్చనను ఉంచి, దొడ్లో ఆరుబయటనే స్నానం చేసి వచ్చి పూజ చేసుకుని తీర్థ ప్రసాదములిచ్చేవారు. వెంట వచ్చిన భక్తులు ఆశ్చర్యపడుతూ. ఆ తరువాత శ్రీ బాబుతో "బొమ్మరిల్లు వలె ఉన్న ఆ యిరుకు గదిలో తమరు ఎలా సర్దుకు పోగలిగారు బాబూ?" అన్నపుడు శ్రీ బాబు "వీడికి కావలసింది అంతర్యాలే గాని, అంతస్తులు కావు" అన్నారు.

ఎంతటి ధనాభావంలో ఉన్నా , శ్రీహరిగారి కుటుంబం, ఏ ఊళ్ళలో శ్రీ బాబు సన్నిధిలో పూజలు జరిగినా వెళ్ళి అన్ని రోజులూ ఉండి వచ్చేవారు. శ్రీ బాబు అనుగ్రహం వలన శ్రీహరిగారికి ఒక చిన్న ఉద్యోగం కూడా దొరికింది. పిల్లలు కూడా పెద్దవారై తమ జీవితాలలో కుదురుకున్నారు.

1972లో ఆశ్రమ స్థాపనానంతరం (క్యాంటిన్) అన్నపూర్ణ భోజన శాలలో కొంత కాలం సేవ చేసుకునే అవకాశం శ్రీహరిగారికి కల్పించారు శ్రీ బాబు. కుటుంబ సమస్యల వల్ల కొంతకాలం వాళ్ళు ఆశ్రమంలో వుండలేకపోయినా అంత్యకాలంలో ఆశ్రమానికే వచ్చి శ్రీ సద్గురు చరణ సన్నిధికి చేరుకున్నారు. శ్రీహరిగారు పక్షవాతంతో బాదపడుతున్నా అంత్య సమయంలో ఎర్రని పట్టు బట్టలతో శ్రీ బాబు దర్శనమిస్తున్న అనుభూతిని పొందుతూ శ్రీసద్గురు సాయుజ్యం పొందారు.

అయిదేళ్ళ తరువాత తులసీదేవిగారు ఒక శివరాత్రి నాటి వుదయానికి ఆశ్రమం చేరుకున్నారు. శ్రీ బాబు ఆమెకు స్వప్న దర్శనమిచ్చి రామ తారక మంత్రోపదేశం చేశారు. ఆమె కామెర్ల వ్యాధితో బాధ పడుతూ ఉగాది నాటి ఉదయం "అదిగో గురుపూజ జరుగుతోంది, స్వామి దర్శనమిస్తున్నారు" అంటూ దివ్యానుభూతిని పొందుతూ శ్రీసద్గురు లయం పొందారు.

-సశేషం

విష్ణు  కథలు

# శ్రీరామానుజులు

-రమణ ప్రసాద్

శ్రీ రామానుజుల వారు 1017 లో శ్రీపెరంబుదూర్ లో జన్మించారు. వీరి తండ్రి పేరు అసూరి కేశవ సోమయాజదీక్షితులు తల్లిపేరు కాంతిమతి. ఈమె వైష్ణవ భక్తాగ్రేసరుడైన ఆళ్వందార్ (యామునా చార్యులు) కు మనుమడైన శ్రీశైల పూర్ణుడు అనే మహా భక్తుని చెల్లెలు. శ్రీశైలపూర్ణుడే తన మేనల్లుడికి రామానుజుడు అని నామకరణం చేశాడు. తమిళంలో "ఇళయ పెరుమాళ్" అంటారు. శ్రీరామానుజుడు సాక్షాత్ లక్ష్మణుని అవతారం. చిన్న వయసులోనే ప్రతిభావంతుడు. కులమత పట్టింపులు లేనివాడు.



శ్రీ రామానుజులవారికి యుక్త వయస్సు రాగానే వివాహం అయింది. ఆయన తండ్రి గతించిన తరువాత కాంచీపురానికి తరలి వెళ్ళారు.

శ్రీ రామానుజుని ప్రత్యేకత ఏమిటంటే ఆయన సకల సిద్ధాంతాలను అర్థం చేసుకుని అన్నిటిని సమన్వయించే విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని రూపొందించారు.

శ్రీరామానుజుని కంచిలో పండిత ప్రకాండుడైన యాదవప్రకాశుని వద్దకు పంపారు. శ్రీరామానుజుడు గురు సన్నిధిలో సకల శాస్త్రాలు అభ్యసించాడు. ఈయనలోని విద్యాలత పరిమళాలను గుబాళించింది. ఈ పరిమళం శ్రీరంగంలో ఉన్న ఆళ్వందార్ వరకు వ్యాపించింది. ఆళ్వందార్ మురిసి పోయి తన ముని మనవడిని చూడటానికి మారు వేషంలో కంచికి ప్రయాణమై వచ్చి శ్రీవరదరాజస్వామి కోవెలలో తన మునిమనవడిని తనివితీరా చూసి సంతృప్తుడయ్యాడు. శ్రీరంగంలో ఉన్న తన మునిమనవడు తన పీఠాన్ని అధిష్టించగలడని ఆనందపడ్డారు.

శ్రీ రామానుజులు యాదవప్రకాశుని వద్ద విద్య ఆర్జిస్తున్నారు. శాస్త్ర విషయాలలో గురు శిష్యుల మధ్య భేదాభిప్రాయాలు వచ్చాయి. ఆ వివాదమే కాకుండా ఇంకొక సంఘటన జరిగింది.

ఆ దేశపురాజు కూతురుకి దెయ్యం పట్టింది. ఆ దెయ్యాన్ని పోగొట్ట వలసిందని యాదవప్రకాశుడిని పిలిచారు. యాదవప్రకాశుడికి దయ్యం లొంగలేదు. పైగా ఆ దెయ్యం "శ్రీరామానుజులు వచ్చినప్పుడే నేను వెళ్ళిపోతాను" అని ప్రకటించింది.

శ్రీరామానుజులు వచ్చారు. ఆయన రాకతో దెయ్యం వెళ్ళిపోయింది. రాకుమార్తెకు స్వస్థత చేకూరింది. యాదవప్రకాశునిలో అసూయాగ్ని ప్రజ్వరిల్లింది. కపటోపాయంతో శిష్యుడైన శ్రీరామానుజుని చంపటానికి పన్నాగం పన్నాడు. శిష్యులందరినీ రామానుజునితో సహా కాశీకి వెళ్ళమని చెప్పి, వారు స్నానం చేస్తుండగా శ్రీరామానుజుడిని గంగలో ముంచివేయాలని కుట్ర పన్నాడు. అతనితో పాటు విద్యాభ్యాసం చేస్తున్న శ్రీరామానుజుని పినతండ్రి కొడుకైన గోవిందభట్టర్ ఆ కుట్రను పసికట్టాడు. ఈ విషయం అతడు శ్రీరామానుజునికి చెపితే, ఆయన ఆ బృందం నుండి తప్పుకొని అరణ్యమార్గం గుండా తిరిగి కంచికి చేరుకున్నారు. అడవిలో ఓ వేటగాడు అతని భార్య ఆ అర్ధరాత్రి కీకారణ్యంలో ప్రత్యక్షమై వారికి దారి చూపించారు. కంచికి రాగానే ఆ వేటగాని భార్య మంచినీరు అడిగింది. శ్రీరామానుజులు నూతినుండి మంచినీరు తెచ్చేసరికి ఆ దంపతులు అదృశ్యమైనారు. వరదరాజస్వామి ఆలయంలో గంటలు గణగణా మ్రోగాయి. ఈ సంకేతంతో వరదరాజస్వామి, లక్ష్మీదేవి తనను మృత్యువు నుండి రక్షించారని గ్రహించాడు. అప్పటి నుండి శ్రీరామానుజుడు దీక్షగా ఆ నూతినుండే నీరు తెచ్చి జగదీశ్వరులకు అర్పిస్తున్నారు.

అదే సమయంలో తిరుకచ్చినంబి అనే భక్తుడు వరదరాజస్వామిని అత్యంత భక్తితో ఆరాధిస్తున్నాడు. శ్రీరామానుజులు తిరుకచ్చినంబి ప్రభావానికి వశమై తనుకూడా దీక్షగా వరదరాజస్వామిని అర్చిస్తున్నాడు.

-సశేషం

---

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD